క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి

కదిరి అర్బన్: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో సోమవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి హాజరై చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగాల లోకేశ్వరెడ్డి, సీనియర్ న్యాయవాదులు నరసింహులు, దశరథ నాయక్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న హెచ్‌ఎం ఉమాపతి, విద్యార్థులు

ధర్మవరం అర్బన్: లివర్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న విద్యార్థినికి పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అండగా నిలిచారు. పట్టణంలోని బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని కాడిశెట్టి కావ్యకు పాఠశాల హెచ్‌ఎం ఉమాపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.69,625 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి విద్యార్థిని ఆపరేషన్‌కు సాయం చేయాలని సూచించారు. విద్యార్థిని తండ్రి కాడిశెట్టి వెంకట్రాముడు ఫోన్‌పే 8106313018 నంబర్‌కు ఆర్థికసాయం చేయాలని విన్నవించారు.

130 కుటుంబాలకు నిత్యావసరాల వితరణ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సత్యసాయి భక్తులు

నల్లమాడ: భగవాన్ సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని లండన్ దేశానికి చెందిన సత్యసాయి భక్తులు సోమవారం మండలంలోని చిల్లగోర్లపల్లిలో 130 కుటుంబాలకు నిత్యావసరాలు అందజేశారు. బాబా స్ఫూర్తితో ఆయన పుట్టిన రోజు సందర్భంగా తమవంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పారకల రమణ, కుళ్లాయి నాయక్, పారకల రామాంజనేయులు, వెంకటేష్, తలమర్ల నరసింహులు, శివ, శంకర పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కదిరి అర్బన్: మండల పరిధిలోని కేఎన్ పాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం మార్కెట్‌యార్డ్ మాజీ వైస్ చైర్మన్ లింగాల మధుసూదన్ రెడ్డి ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, సర్పంచ్ రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్ పాల్గొన్నారు.

నేడు రోడ్డు ప్రారంభోత్సవం

కదిరి అర్బన్: మండల పరిధిలోని రాచువారిపల్లి తండా నుంచి వీరేపల్లి పేట వరకూ నూతనంగా నిర్మించిన తారు రోడ్డును మంగళవారం ఉదయం 10 గంటలకు వీరేపల్లిపేటలో ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ప్రారంభించనున్నారు.

మురుగు ప్రవహిస్తుంటే మీరేం చేస్తున్నారు?



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీపీఓ శివకుమారి

పుట్టపర్తి అర్బన్: రోడ్లపై మురుగు ప్రవహిస్తుంటే మీరంతా ఏమి చేస్తున్నారని సచివాలయ సిబ్బందిపై ఇన్‌చార్జ్ డీపీఓ శివకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువులో ఆమె పర్యటించారు. రోడ్లపై ప్రవహిస్తున్న మురుగును పరిశీలించి, అసహనం వ్యక్తం చేశారు. రోడ్లపై నీరు పోస్తుంటే మీరు చూస్తూ ఉన్నారా వెంటనే కుళాయి కనెక్షన్లు కట్ చేసి సంబంధిత కుటుంబాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయని ఎక్కడా అపరిశుభ్రత కనిపించరాదన్నారు. ఇళ్ల నుంచి వచ్చే నీటితో పాటు కొండపై నుంచి వచ్చే ఊట నీరు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అశోక్ కుమార్‌రెడ్డి, సెక్రెటరీ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి





బత్తలపల్లి మండలం పోట్లమర్రిలో జెండా ఎగురవేస్తున్న నాయకులు, పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



ధర్మవరం 7వ వార్డులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మెన్లు, నాయకులు

- 'వై ఏపీ నీడ్స్ జగన్'కు ప్రజల స్పందన

ధర్మవరం: కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మెన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం తెలిపారు. పట్టణంలోని 7వ వార్డు శివానగర్ సచివాలయం వద్ద సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం 7వ వార్డులో వెచ్చించిన నిధుల పట్టిక బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో చాంద్‌బాషా, పట్టణ సచివాలయాల కన్వీనర్ మాసపల్లి సాయికుమార్, కౌన్సిలర్ బ్రహ్మయ్య, వార్డు ఇన్‌చార్జ్ గడ్డం రంగా పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని మండల కన్వీనర్ నరసారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువు సచివాలయం పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంగళమ్మచెరువు సచివాయం పరిధిలోని గ్రామాల్లో డీబీటీ నాన్ డీబీటీ ద్వారా ఏకంగా రూ.33.44 కోట్ల లబ్ధి చేకూరిందని ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశు, నాయకులు నరేష్, అంజనేయులు, దారా శంకర్, రాగెప్ప, డీలర్ రమణ పాల్గొన్నారు.

నల్లమాడ: నల్లమాడ సచివాలయం-3లో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబంలో సంక్షేమ వెలుగులు నింపుతున్న వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్లలో వివిధ పథకాల ద్వారా రూ.32 కోట్ల సాయాన్ని నేరుగా ప్రజలకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పారకల రమణ, మాజీ మండల కన్వీనర్ పారకల రామాంజనేయులు, సచివాలయ కన్వీనర్లు చిన్నాదేవి, మహేష్ నాయక్, అంజినాయక్, మాధవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

బత్తలపల్లి: పేదలకు సంక్షేమ ఫలాలు అందాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలి. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పోట్లమర్రి సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయాల పరిధిలో ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జగనన్న చేకూర్చిన లబ్ధిని వివరించాలని సూచించారు. గ్రామంలోని యువనేత దినేష్ కుమార్‌రెడ్డి ఇంటి సమీపంలో మా నమ్మకం నువ్వే జగన్ బ్యానర్, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచు అక్కిం దామోదర్, ఈఓఆర్డీ దివాకర్, కార్యదర్శి ప్రకాష్, సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్ రెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కాశప్ప, ఉప సర్పంచు చెన్నకృష్ణారెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ కరీంసాబ్, నాయకులు హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి, ఆంజనేయులు, వెంకటనారాయణ రెడ్డి, దినేష్‌కుమార్‌రెడ్డి, చంద్రమోహన్, నరేంద్రరెడ్డి, బండి నాగభూషణ, పెదయ్య, ముసలప్ప, వెంకటరాముడు పాల్గొన్నారు.

పుట్టపర్తి: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి సచివాలయంలో గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు బట్టల కేశప్ప, వైస్ సర్పంచ్ కృష్ణారెడ్డి, సచివాలయాల కన్వీనర్లు చంద్ర, లోసారి వెంకట్రాముడు, అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

ఓడీచెరువు: ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు చేరాలంటే జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందామని జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇనగలూరు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సర్పంచ్ బాబా ఫక్రుద్దీన్ అధ్యక్షతన నిర్వహించారు. పంచాయతీకి రూ.29.87 కోట్ల లబ్ధి చేకూరిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరలక్ష్మి, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షామీర్ బాషా, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, భాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: ఎనుములపల్లి-2 సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. మునిసిపల్ చైర్మన్ ఓబుళపతి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తిప్పన్న, పార్టీకన్వీనర్ సూర్య గౌడ్, కన్వీనర్ రంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ కవిత రెడ్డి, పదో వార్డు అధ్యక్షుడు నారపరెడ్డి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



ఓడీచెరువు మండలం ఇనగలూరులో పథకాలను వివరిస్తున్న నాయకులు



నల్లమాడ గ్రామ సచివాలయం-3 వద్ద పార్టీ జెండా ఆవిష్కరణ..



బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రామాంజనేయులు మృతదేహం

బత్తలపల్లి: బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి క్వార్టర్స్‌కు చెందిన నరసింహులు కుమారుడు ఎస్.రామాంజనేయులు (47) అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి వద్ద ఉన్న ఆధార్‌కార్డులో చిరునామా మేరకు ఆర్డీటీ ఆసుపత్రి క్వార్టర్స్‌లో పోలీసులు విచారణ చేపట్టారు. అక్కడ అలాంటి వారు ఎవ్వరూ లేరని ఆర్డీటీ సిబ్బంది సమాచారం ఇచ్చారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే ఈ ఫోటో ఆధారంగా అనంతపురం ఆసుపత్రిలో లేదా అనంతపురం టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మృతదేహం అనంతపురం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

క్రీడల్లో సత్తా చాటండి

ధర్మవరం అర్బన్: ఖేలో ఇండియా ఉమెన్స్ జూడో లీగ్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేసినట్లు కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మేరి వరకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ కేరళలో ఖేలో ఇండియా ఉమెన్స్ జూడో లీగ్ చాంపియన్‌షిప్ జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొంటున్న అర్చన, ఉషారాణి, సాయిప్రియ, యువసంధ్య, సుస్మితను ఉపాధ్యాయులు, జూడో కోచ్ ఇనాయత్ బాషా అభినందించారు. విద్యార్థులు అక్కడ కూడా రాణించాలని ఆకాంక్షించారు.

క్రీడా సామగ్రి పంపిణీ

చెన్నేకొత్తపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా సామగ్రిని ఎంఆర్‌సీలో ఎంఈఓ-2 ప్రసన్న కుమార్ నాయుడు సోమవారం పంపిణీ చేశారు. మండలంలో 56 ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలకు విద్యార్థులు ఆడుకునేందుకు 10 రకాల క్రీడా సామగ్రిని అందించినట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రవీంద్ర రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ఎంఆర్‌సీ సిబ్బంది శివారెడ్డి వెంకటష్ సుబ్బారెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కందికుంటది కబ్జాల బాట

- వైఎస్సార్‌సీపీ హయాంలో చాలా గ్రామాలకు రోడ్లు వేశాం
- త్వరలో గాండ్లపెంటకు కృష్ణా జలాలు తెస్తున్నాం
- ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అభివృద్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: 'అనతి కాలంలోనే కదిరి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాను. మారుమూల గ్రామాలకు రోడ్లు వేయించాను. హంద్రీనీవాతో చెరువులకు జలకళ తెచ్చాను. త్వరలోనే గాండ్లపెంట మండలానికి సైతం కృష్ణా జలాలు తీసుకురాబోతున్నాను. ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయని మీకు అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిది? నీది కబ్జాల బాట.. నాది అభివృద్ధి బాట' అని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లన్నీ గుంతల మయం.. అంటూ ఆదివారం జనసేన-టీడీపీ కలిసి పట్టణంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో కందికుంట చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే తిప్పి కొట్టారు. సోమవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చేసిన అభివృద్ధిని వివరించారు. బ్యాంకులను కొల్లగొట్టి డీడీలు కాజేసి కోట్ల రూపాయలు దోచుకోవడం.. క్రిస్టియన్, ముస్లిం మైనార్టీల ఆస్తులను కబ్జా చేయడం.. గూండాగిరి చేయడం, పేదల ఆస్తులు కాజేయడం వంటి పనులు చేసే నీకు.. నేను చేసే అభివృద్ధి ఎక్కడ కనబడుతుందని కందికుంటపై విరుచుకుపడ్డారు.

రూ.843.41 కోట్లతో రోడ్ల నిర్మాణాలు

'వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా రూ.843.41 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టాం. రూ.100 కోట్లకు పైగా వెచ్చించి 150కి పైగా మారుమూల గ్రామాలకు రోడ్లు వేశాం. రూ.230 కోట్లతో చేపట్టిన కదిరి బైపాస్ రోడ్డును త్వరలోనే ప్రారంభించబోతున్నామని తెలిపారు.

మీరు వచ్చేదీ లేదు.. నీళ్లు తెచ్చేదీ లేదు

'మేము అధికారంలోకి వస్తే కృష్ణా జలాలు తెస్తామని చంద్రబాబుతో సహా ఆ పార్టీ స్థానిక నాయకులు చెబుతున్నారు. మీరు అధికారంలోకి వచ్చేదీ లేదు.. నీళ్లు తెచ్చేదీ లేదు. ఇప్పటికే మేము కదిరి నియోజకవర్గ వర్గంలో ఎన్నో చెరువులకు హంద్రీనీవాతో జలకళ తెచ్చాం. గాండ్లపెంట మండలానికి సైతం రూ.45 కోట్లతో ఎత్తిపోతల పథకం ద్వారా 0.2 టీఎంసీల కృష్ణా జలాలను తీసుకొచ్చి మరో 32 చెరువులకు నీళ్లిచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 5 ఏళ్ల ఎమ్మెల్యేగా ఉన్న నీకు.. ఇప్పుడు ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి కోనేరు కనిపించిందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనేరును సుందరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో తాము ప్రయత్నించామన్నారు. ఇందు కోసం రూ.2 కోట్లు దాకా నిధులు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అయితే భారీ వర్షాలకు కోనేరు మీదుగా మద్దిలేరు వాగు వెళ్లడంతో మళ్లీ మొదటి నుంచి పనులు చేపట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. త్వరలో కచ్చితంగా దీన్ని కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఆలయానికి సంబంధించిన ఆస్తులన్నింటికీ కంచెలు వేసి కబ్జాకు గురి కాకుండా చేసినట్లు చెప్పారు. చలపతి నాయుని సత్రంలో ఎన్నో అద్దె గదులను భక్తులకు అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. సమావేశంలో ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, గాండ్లపెంట ఎంపీపీ జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

26న వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

ధర్మవరం అర్బన్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ సూర్యప్రకాష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9030944717 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

10లోపు సర్వే పూర్తి చేయాలి

అమడగూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 10వ తేదీలోపు కుల గణన సర్వే పూర్తి చేయాలని డీఎల్‌డీఓ సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ.. గ్రామ వలంటీర్లతో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. అలాగే కుటుంబ సభ్యులందరితో బయోమెట్రిక్ వేయించుకోవాలన్నారు. 27వ తేదీన సర్వేను ప్రారంభించి వచ్చే నెల 10లోపు ముగించాలన్నారు. ఎంపీడీఓ మునెప్ప, ఈఓఆర్డీ నసీమా, ఏపీఎం గోపాల్, కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

కనగానపల్లి: కరువు నివారణకు ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జేవీ రమణ డిమాండ్ చేశారు. సోమవారం మండల రైతు నాయకులతో కలిసి ఆయన తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందించారు. నాయకులు మహదేవ, గోవిందు, మల్లికార్జున, నాగరాజు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'

తలుపుల: మండలంలోని ఉడమలకుర్తిలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సిద్దారెడ్డి హాజరవుతారని పార్టీ మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, సీనియర్ నాయకుడు వెంకటపతినాయుడు తెలిపారు.

నల్లచెరువు: పి.కొత్తపల్లి సచివాలయంలో మంగళవారం సాయంత్ర 4 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ రమణారెడ్డి, కన్వీనర్ హైదర్‌వలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

ఎన్పీకుంట: ధనియానిచెరువు సచివాలయం పరిధిలో మంగళవారం సాయంత్రం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటె రాము, మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల కన్వీనర్లు హాజరుకావాలని కోరారు.

గాండ్లపెంట: కురుమామిడి పంచాయతీ రెక్కమాను సచివాలయంలో మంగళవారం మధ్యాహ్నం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొంటారన్నారు. మండల ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొనాలని కోరారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి



తహసీల్దార్ కార్యాలయంలో వినతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

గాండ్లపెంట: 'స్పందన' కార్యక్రమానికి వచ్చే సమస్యలను అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. భూ సమస్యలు, పక్కా గృహాలు, పట్టాదారు పాసుపుస్తకాలకు వచ్చిన వినతులను పరిశీలించారు. అధిక శాతం రెవెన్యూ శాఖ, పక్కా గృహాల సమస్యలను పరిష్కరించకపోవడంతో వీఆర్వో, గృహనిర్మాణ శాఖ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపకపోతే చర్యలు తప్పవన్నారు. స్పందనకు వచ్చిన 19 సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో నెల రోజుల్లో తెలపాలని ఆయా శాఖల అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హమీద్‌బాషా, ఎంపీడీఓ రామానాయక్, సర్పంచ్ రహంతుల్లా, ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, మాజీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీంద్రా నాయక్, సొసైటీ అధ్యక్షుడు ఎస్పీ హైదర్‌వలీ, బీసీ కన్వీనర్ జక్కల నరసింహగౌడ్, ఆర్బీకే చైర్మన్ శంకర్‌నాయుడు, పలువురు సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో సోమవారం గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారులు సూచించారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం, డిజిటల్ లైబ్రరీ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. - సాక్షి నెట్‌వర్క్:

వ్యక్తి దుర్మరణం

అమడగూరు: మండలంలోని జేకేపల్లికి చెందిన ఉత్తప్ప (36) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. 108 సిబ్బంది తెలిపిన మేరకు వివరాలు.. జేకేపల్లికి చెందిన ఉత్తప్ప సోమవారం రాత్రి మహమ్మదాబాద్ నుంచి సొంత గ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అయితే మార్గంమధ్యలో తనంతట తానే ఒకవైపు జారి పడిపోవడంతో తలకు పెద్ద గాయమైంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మిగిలిన వివరాలు తెలియాల్సి ఉంది. ఎస్ఐ బలరామయ్య కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కార్తీక శోభ

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో సోమవారం కార్తీక మాసం సందడి నెలకొంది. మొదటి సోమవారం మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివెళ్లి దీపాలు వెలిగించారు. బత్తలపల్లిలోని లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుడి ఆలయంలో ఆలయ శాశ్వత ధర్మకర్త, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ తదితరులు ఆకాశదీపాన్ని ఎగుర వేశారు. పలు ఆలయాల్లో ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. - సాక్షి నెట్‌వర్క్:



పుట్టపర్తిలోని శివాలయంలో కార్తీక దీపాల వెలుగులు



బత్తలపల్లిలో ఆకాశ దీపోత్సవం..

స్పందనకు 12 అర్జీలు

బత్తలపల్లి: స్పందనలో ప్రజల నుంచి అందే అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని తహసీల్దార్ యుగేశ్వరి దేవి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. భూ సమస్యలపై 8, రస్తా సమస్యలపై 2, ఇంటి స్థలాల కోసం 2 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజినీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఏఓ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తలుపుల: మండలంలో ఖాళీగా ఉన్న 2 వలంటీర్ పోస్టులకు ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కిరణ్ మోహన్‌రావు సోమవారం తెలిపారు. ఈదులకుంట్లపల్లి (ఓసీ-జనరల్), బండ్లపల్లి (బీసీ-జనరల్) ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు.

వాటర్ సర్వీస్ సెంటర్ ధ్వంసం

కదిరి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఉన్న సైదాపురానికి చెందిన నందకిషోర్ వాటర్ సర్వీస్ సెంటర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీతో ధ్వంసం చేశారు. గోడను పగులగొట్టి, స్థలాన్ని చదును చేశారు. దుండగులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకట బసప్ప తెలిపారు.

నేటి నుంచి అన్నదానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్ట వద్ద ఉన్న అయ్యప్ప స్వామి భజన మందిరంలో మంగళవారం నుంచి అన్నదానం చేస్తామని గురుస్వామి పీజే విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. అన్నదానానికి వచ్చే మాలధారులు భజన మందిరంలో ఉదయం 9 గంటల్లోపు టోకన్లు తీసుకోవాలని సూచించారు. రోజూ 1 గంట నుంచి 2:30 గంటల వరకూ అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

ఉపాధి పని దినాలు పెంచాలి

ఎన్పీకుంట: ఉపాధిహామీ కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మమ్మమర్రిమానును ఆయన సందర్శించారు. సత్యసాయి జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జిల్లా కార్యదర్శి నాగన్న, డివిజన్ కార్యదర్శి ఇలియాజ్, మగ్బూల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.